మంత్రి సీతక్క స్వగ్రామంలో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క స్వగ్రామం సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అయింది. ములుగు మండల పరిధిలోని జగ్గన్నపేటలో సర్పంచ్ పదవి కోసం కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల అభ్యర్థులు కూడా నామినేషన్లను దాఖలు చేశారు. గ్రామ అభివృద్ధి, ఐక్యత ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టిన చర్చలు సానుకూల ఫలితాన్ని ఇచ్చాయి. ఏకాభిప్రాయం అనంతరం మంత్రి సీతక్క, స్థానిక నాయకులు పోటీదారులతో సమాలోచనలు జరిపారు. ఫలితంగా కాంగ్రెస్ మద్దతుతో బరిలో ఉన్న అర్రెం వెంకన్న ఏకగ్రీవ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు.

హిల్ట్ పాలసీపై 7న బిజెపి ధర్నా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీ, జీహెచ్ఎంసీ విస్తరణ తదితరాంశాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ... ఈ నెల 7న బిజెపి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'గ్యారంటీల గారడీ - నెరవేరని వాగ్దానాలు, ప్రజా వంచన రెండేళ్ల' అనే నినాదంతో ఇందిరాపార్కులో నిర్వహించనున్న ధర్నాకు పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ క్రమంలో పార్టీ ప్రతినిధి బృందంతో కలిసి ఆయన ధర్నా స్థలిని పరిశీలించారు.

దామోదర్ మృతి పట్ల దిగ్భ్రాంతి

ఆజాక్ ఛానల్‌లో వీడియో జర్నలిస్ట్‌గా పని చేస్తున్న దామోదర్ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఆకస్మికంగా మరణించడంపై బిజెపి అధ్యక్షులు రాంచందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. అనేక సంవత్సరాలుగా అందరితో కలిసిమెలిసిగా ఉండేవారని గుర్తు చేశారు.

ఆదిలాబాద్‌కు విమానాశ్రయం

- రాజకీయాలకతీతంగా వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి
- ఇంద్రవెల్లి స్ఫూర్తితో నిరంకుశంపై పోరాటం
- ఆదిలాబాద్ సభలో సిఎం రేవంత్ రెడ్డి


బహిరంగ సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్సు దించి... పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ 260 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

"రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పూర్తి చేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. రెండేళ్లలో ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం.. ప్రజల దీవెన, దేవుడి సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదు. ఎమ్మెల్యేలను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశాం. ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో... గత పదేళ్లలో అది నెరవేరలేదు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం.

పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై నేను పోరాటం ప్రారంభించా. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్మృతి వనం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రం పై సంతకం పెట్టాను. ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును డిజైన్ చేశారు. మాజీ సిఎం కెసిఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కన పెట్టి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లకే కాళేశ్వరం కూలింది. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ ఆ కుటుంబంలో గొడవలు పడుతున్నారు. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తాం. ఎన్నికల ఉత్సవం పూర్తి కాగానే మరో 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం" అని సీఎం హామీ ఇచ్చారు. సభలో రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపన వివరాలు

రూ.18.70 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల సమగ్ర అభివృద్ధి పనులు

రూ.1.75 కోట్ల పెట్టుబడితో ఇందిరా మహిళా శక్తి క్రింద స్వయం సహాయక మహిళా సంఘాలతో పెట్రోల్ బంక్ స్థాపన.

రూ.19.69 కోట్లతో 160 స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు.

రూ.200 కోట్లతో పట్టణ పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, కాంప్లెక్స్ నిర్మాణం

రూ.2 కోట్లతో మహాలక్ష్మి వాడ, విద్యానగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, ఆధునికీకరణ కు శంకుస్థాపన.

రూ. 231.24 లక్షల నిధులతో కొత్త కలెక్టరేట్ సమీపం వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన.

హిల్ట్‌పై అఖిలపక్ష సమావేశం

- సిపిఎం డిమాండ్
- విలువైన భూములను పారిశ్రామికవేత్తలకు దారాదత్తం చేయొద్దని హితవు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీపై చర్చించేందుకు వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని సిపిఎం, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. లక్షల కోట్ల విలువైన భూములను పారిశ్రామికవేత్తలకు దారాదత్తం చేయొద్దని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ నగరంలోని 22 పారిశ్రామిక కేంద్రాల్లోని పరిశ్రమలన్నింటినీ నగరం బయటకు తరలించేందుకు జీఓ 27ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. అందు కోసం 9300 ఎకరాల భూమిని అతి తక్కువ ధరలకే పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టడం వల్ల లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందని గుర్తు చేశారు. కన్వర్షన్ పేరుతో రియల్ ఎస్టేట్‌కు కట్టబెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఇండ్ల స్థలాలు, క్రీడా స్థలాలు, పాఠశాలలు, హాస్పిటల్స్ కోసం భూములు కేటాయించాలని కోరారు. లక్షల కోట్ల విలువైన వేలాది ఎకరాల భూముల విషయంలో సంబంధించిన అంశాలపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, శాసనసభలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'కాలుష్యాన్ని సృష్టించే పరిశ్రమలను నగరం నుంచి తరలించాల్సిందే తప్ప, మిగతా పరిశ్రమలన్నింటిని ఎందుకు తరలిస్తున్నారు? పరిశ్రమలను తరలిస్తే కార్మికుల పరిస్థితి, వారి భద్రతకు తీసుకుంటున్న చర్యలేంటి? వారికి నివాసం, విద్యా, వైద్యం, ఉపాధి పరిస్థితులేంటి? పరిశ్రమలను బయటకు తరలిస్తే, ఈ భూములను ఆ పారిశ్రామిక వేత్తలకే మార్కెట్ ధరకు కాకుండా, అతి తక్కువ ధరకే ఎందుకివ్వాలి? ప్రభుత్వం కేటాయించిన భూముల్లో మూతపడిన పరిశ్రమలు ఎన్ని? ఆ భూముల్ని ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? నగరంలో విలువైన భూములను పారిశ్రామికవేత్తలకు దారాదత్తం చేయడమే. ఇదొక హిల్ట్ స్కామ్‌గా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి' అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి విధానాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం చేసినా, బిజెపి ప్రభుత్వం చేసినా, కాంగ్రెస్ ప్రభుత్వం చేసినా ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలి తప్ప పారిశ్రామిక వేత్తలకో, రాజకీయ నాయకులకో భూములను అప్పగించేలా ఉండకూడదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 'ఈ సమస్యలన్నింటిపై నిర్దిష్టమైన వివరాలను ప్రజలముందు ఉంచాలి. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. విలువైన భూములను పారిశ్రామికవేత్తలకు దారాదత్తం చేసి, లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఆందోళనకు పూనుకుంటాం' అని ఆయన హెచ్చరించారు.



సదస్సులో మాట్లాడుతున్న శ్రీవాస్తవ

టెండర్ నిబంధనలను పాటించాల్సిందే

- దక్షిణ మధ్య రైల్వే జిఎం శ్రీవాస్తవ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంట్రాక్టు విధానంలో టెండర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ అన్నారు. నిర్ణయాలను మూల్యాంకనం చేయడంలో అధికారులదే పాత్ర కీలకపాత్ర అని చెప్పారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో 'టెండర్లు, కాంట్రాక్టులతో విజిలెన్స్ దృక్పథం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీవాస్తవ మాట్లాడుతూ కాంట్రాక్టులు, టెండర్లపై ఇష్టారాజ్యంగా నిర్ణయాలు చేసే అవకాశం లేదన్నారు. అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్ మాట్లాడుతూ టెండర్లు దాఖలు చేయబడిన ఉద్దేశాన్ని సకాలంలో నెరవేర్చడానికి చురుగ్గా వ్యవహరించాలని చెప్పారు. అన్ని రకాల టెండర్లను త్వరగా ఖరారు చేయాలని సూచించారు. కాంట్రాక్టులను పొడిగించే సమయంలో వాటిని క్షుణ్ణంగా సమీక్షించాలని అధికారులకు సూచించారు.రైల్వే పనులు చేపట్టే క్రమంలో కాంట్రాక్టులకు సంబంధించి టెండర్ నిబంధనలను పాటించాల్సిందేనని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఆశిష్ మెహ్రోత్రా అన్నారు. విజిలెన్స్ అనేది వాటాదారుల సమిష్టి బాధ్యత అని అభిప్రాయపడ్డారు. రోజువారి పనిలో శాఖాపరమైన నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా అనుసరించాలని సూచించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్(సమన్వయం), జనరల్ మేనేజర్ కార్యదర్శి మల్లాది శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం, భారత కాంట్రాక్టు చట్టం, వస్తువుల అమ్మకం చట్టం, జీఎఫ్ఆర్, ఇండియన్ రైల్వే విజిలెన్స్, మాన్యువల్, సీవీసీ మాన్యువల్,రైల్వే బోర్డు సర్క్యులర్లు, సూచనలతో అందుబాటులో ఉన్న అంశంపై నిబంధనలు చర్చించబడ్డాయని అన్నారు. ప్రతిపాదనల సూత్రీకరణ, కాంట్రాక్టు నిర్వహణ, అసాధారణంగా తక్కువ రేటింగ్ ఉన్న బిడ్‌లను పరిశీలించాలని చెప్పారు.

కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి

కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆదర్శవంత రాజకీయ వేత్త అని రాజకీయ నాయకులకు మార్గదర్శకుడని తెలంగాణ శాసనమండలి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. రోశయ్య 4వ వర్ధంతి సభ తెలంగాణ భాషా సంస్కృతి శాఖ రవీంద్రభారతి లో కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొని తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోశయ్య సమయస్ఫూర్తి కలిగిన వ్యక్తి అని కొనియాడారు. క్రమశిక్షణకు మారుపేరు రోశయ్య అని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోశయ్య జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆలోచన అభినందనీయమన్నారు. రోశయ్య జీవితం భవితరాలకు తెలియజేయాలన్నారు. సుదీర్ఘకాలంగా రాజకీయ రంగంలో అనేక సేవలందించారని కీర్తించారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. రోశయ్య ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎమ్మెల్సీగా అనేక పదవులతో పాటు ఆర్థిక శాఖ మంత్రిగా పరిపాలనా దక్షత, ఆర్థిక నిపుణుడిగా మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రోశయ్య వ్యక్తిగతంగా ఎప్పుడూ పదవిని ఆశించకుండా, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని తెలిపారు. ఆయన ఆశయాలను రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రోశయ్య రాజకీయాలకు అతీతంగా అనుభవజ్ఞుడిగా, అందరి గౌరవాన్ని పొందిన సీనియర్ నాయకుడిగా, ఆధునిక భీష్ముడిగా గుర్తింపు పొందారన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు మాట్లాడుతూ.. రోశయ్య వర్ధంతి సభను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా తనను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వి. హనుమంతరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు బొగ్గారపు దయానంద్, తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు కాల్వ సుజాత, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ శాసనసభ్యులు గణేష్ గుప్తా, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు కొణిజేటి శివ సుబ్బారావు, తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా పాల్గొన్నారు.

సిపిఐ నేతలకు ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో తన విజయానికి కృషి చేసిన సిపిఐకి ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నర్సింహ, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఆ పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్, కార్యవర్గ సభ్యులు ఎస్ చాయాదేవిని కలిసి ధన్యవాదాలు తెలిపి సమావేశమయ్యారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను సిపిఐ నాయకులు శాలువా, పుష్పగుచ్చాలతో ఆమెను సన్మానించారు, ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల అవగాహన కొనసాగింపులో భాగంగానే కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతునిచ్చామని, రాజకీయ లక్ష్యంతో తమ కర్తవ్యాన్ని పూర్తి చేశామని తెలిపారు. సమావేశంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ, సీపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, నగర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి నథింగ్ ఫోన్3ఎ లైట్ విక్రయాలు

న్యూఢిల్లీ : లండన్‌కు చెందిన స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల బ్రాండ్ నథింగ్ కొత్తగా ఫోన్3ఎ లైట్ అమ్మకాలను డిసెంబర్ 5 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. ఇందులో బ్లూ వేరియంట్ కూడా ఉందని.. ఆఫర్లతో కలిపి ఈ ఫోన్ ప్రారంభ ధరను రూ.19,999గా నిర్ణయించినట్లు 6.77 అంగుళాల ఫ్లెక్సిబుల్ అమోలెడ్ డిస్‌ప్లే కలిగిన ఈ ఫోన్‌ను 5000 ఎంఎహెచ్ బ్యాటరీతో రూపొందించింది. ఇందులో 50 ఎంపి మెయిన్ సామ్‌సంగ్ సెన్సార్ కెమెరా సహా 8 ఎంపి, 2ఎంపి కెమెరాలను,సెల్ఫీ కోసం 16 ఎంపి కెమెరాలను పొందుపర్చింది.

గెలాక్సీ ట్యాబ్ ఎ11 విడుదల

గూర్‌గావ్ : భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్ కొత్తగా గెలాక్సీ ట్యాబ్ ఎ11ను విడుదల చేసింది. అన్ని వయసుల వినియోగదారులకు ఇది ఉపయోగపడుతోందని పేర్కొంది. 8.7 అంగుళాల డిస్‌ప్లేతో 90హెచ్‌జడ్ రిఫ్రెష్ రేట్‌ను కలిగి ఉంటుందని పేర్కొంది. డాల్బీ-ఇంజనీర్డ్ డ్యూయల్ స్పీకర్‌లను కూడా కలిగి ఉందని, ఇవి సినిమాలు, సంగీతం లేదా వీడియో కాల్‌లకు అనువైన, మహోన్నత, మల్టీ డైమెన్షనల్ ఆడియోను అందిస్తాయని తెలిపింది. స్పష్టమైన వీడియో కాల్‌ల కోసం 5ఎంపి ఫ్రంట్ కెమెరా, 128జిబి స్టోరేజ్‌తో కూడా లభిస్తుందని తెలిపింది. ర్యామ్, స్టోరేజీ ఆధారంగా దీని ధరల శ్రేణిని రూ.12,999 నుంచి రూ.20,999గా నిర్ణయించింది.

గ్లోబల్ సమ్మిట్‌కు ప్రజలకు అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికీ శుభవార్త చెప్పింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-విజన్ 2047 పబ్లిక్ ఎగ్జిబిషన్‌కు సాధారణ ప్రజలను అనుమతించింది. డిసెంబర్ పది నుంచి 13 వరకు ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రజలందరికీ ఉచిత ప్రవేశం కల్పించనున్నట్టు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. భవిష్యత్ ప్రాజెక్టుల సెషన్లు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో సంభాషణలు, ప్రభుత్వ శాఖల స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించే అవకావం కల్పించారు. ఇందు కోసం ప్రతిరోజూ ప్రత్యేక ఉచిత బస్సు సేవలను కల్పించారు. సమ్మిట్‌కు వెళ్లేందుకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి రావడానికి సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నడుస్తాయి. ఎంజిబిఎస్, జెబిఎస్, కూకట్‌పల్లి, చార్మినార్, ఎల్‌బినగర్ వంటి ప్రధాన కేంద్రాల నుండి అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

సాహితీ లోకం ఆత్మీయులు సుధను కోల్పోయింది

- ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి కల్చరల్



అపార అనుభవం సామాజిక అవగాహన తో రచనలు చేసిన సుధా దేవి ఇంత త్వరగా కను మూయడం ఊహించనీ విషాదం అని ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సాహితీ లోకం ఆత్మీయురాలును కోల్పోయిందని ఆయన అవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మృతి చెందిన డాక్టర్ తెన్నేటి సుధ దేవి స్మృతి సభ రాఘవేంద్ర స్వామి మఠంలోని ఆడిటోరియంలో కుటుంబ సభ్యులు వంశీ రామరాజు వంశీధర్, వంశీ కృష్ణ గాయకులు వైఎస్ రామకృష్ణ తదితరులు నిర్వాహణలో జరిగింది. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో అప్యాయంగా పలకరించే సుధాదేవి తనకు అమ్మ వంటిది అన్నారు. ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ వంశీ ఇంటర్నేషనల్ స్థాయిలో గుర్తింపు పొందేందుకు రామరాజుకు ఆయన భార్య సుధాదేవి చేదోడు వాడోడుగా నిలిచారని చెప్పారు. ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ తెలుగు అకాడమీ ఉప సంచాలకులుగా సుధాదేవి అనేక తరగతుల పాఠ్యపుస్తకాలు రూప కల్పనలో భాగస్వామి అని తెలిపారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ సుధాదేవి ఆమె పేరిట ప్రతి ఏటా ఒక రచయిత్రి కి అవార్డ్ ఇవ్వాలని సూచించారు. ఇట్లా సంస్థ అధ్యక్షుడు ధర్మారావు మాట్లాడుతూ సుధాదేవి తెలంగాణకి చెందిన గొప్ప రచయిత్రి అన్నారు. కళపత్రిక సంపాదకుడు రఫీ మాట్లాడుతూ సుధాదేవి ఆత్మీయ వ్యక్తిత్వం ఆమె కథలలో ప్రతిఫలిస్తుందని వివరించారు. సంఖ్య శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ మాట్లాడుతూ సుధాదేవి తన రచనలతో చిరస్థాయిగా నిలిచి ఉంటారని అన్నారు. కిన్నెర సంస్థ రఘురాం అభినందన సంస్థ భవాని జివిఆర్ ఆరాధన సంస్థ రాఘవ రెడ్డి సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు కవి పెద్దూరి వెంకట దాసు రచయిత్రి రాజ్య శ్రీ సినీ నిర్మాత రామ సత్య నారాయణ ప్రచురణ సంస్థ జ్యోతి వల్ల భోజ్యుల పలువురు గాయనీ, గాయకులు, రచయితలు పాల్గొని సుధాదేవితో తమకు ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు శాసన సభ పూర్వ సభాపతి సిరికొండ మధుసూదనాచారి డాక్టర్ వకుళభరణం కృష్ణ మోహన్‌రావు గజల్ శ్రీనివాస్ నివాళి అర్పించారు ఈ సందర్భంగా సుధాదేవి మృతికి. ముందు ప్రచురణ కోసం ఇచ్చిన తన కథల సంపుటి 2, వ భాగంను రాజేంద్ర ప్రసాద్ రేలంగి నరసింహారావు వంశీ రామరాజు ఇతర ప్రముఖుల కలసి ఆవిష్కరించారు

హైటెక్స్‌లో ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ ప్రారంభం



హైదరాబాద్ : దేశంలోని ప్రముఖ ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్‌లలో ఒకటైన ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ (ఐఐటిఎమ్) గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో డిసెంబర్ 4 నుంచి 6వ తేది వరకు మూడు రోజుల పాటు దీన్ని నిర్వహిస్తోన్నట్లు స్ఫియర్ ట్రావెల్ మీడియా డైరెక్టర్ సంజయ్ హాఖూ తెలిపారు. ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల ప్రయాణ, హాస్పిటాలిటీ, ప్రభుత్వ రంగాల స్టాల్స్‌తో పాటు కొన్ని విదేశీ పర్యటక సంస్థలు కూడా స్టాల్స్ ఏర్పాటు చేశాయన్నారు.. ట్రావెల్ వ్యాపారాల మధ్య అనుసంధానం, పర్యటన అవకాశాల ప్రోత్సాహం మరియు ఈ రంగ అభివద్ధికి దోహదపడే మరో మైలురాయిగా ఈ ఈవెంట్ నిలిచిందన్నారు. ఈ ఎడిషన్‌లో 10 దేశాలు సహా భారత్‌లోని 25 రాష్ట్రాల నుండి 200కు పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారన్నారు.

మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో గ్రీన్ ఇనిషియేషన్ డే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డా.ఎం అశోక్ జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇనిషియేషన్ డే ఘనంగా నిర్వహించారు. పర్యావరణంపై అవగహన కల్పించాలనే ప్రధాన లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.అశోక్ మాట్లాడుతూ,2030 నాటికి కాలేజీని ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులతో కలిసి క్యాంపస్‌లో 50 మొక్కలు నాటారు. ప్లాస్టిక్ రహిత క్యాంపస్ కోసం ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం అభినందనీయమని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులను పలువురు ప్రశంసించారు.

సివిల్స్ అభ్యర్థులందరికీ సాయం

- సీనియర్ అధికారులతో ఇంటర్వ్యూ బోర్డు : ఉపముఖ్య మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ఎంతమందికైనా ఆర్థిక సాయం అందిస్తామని ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో యుపిఎస్‌సి ఇంటర్వ్యూకు ఎంపికైన 50 మందికి రూ.లక్ష చొప్పున చెక్కులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. రాష్ట్రం నుంచి ఎంత మంది ఎక్కువ ఎంపిక అయితే రాష్ట్రానికి అంత ఖ్యాతి వస్తుందని భావించి వారిని ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. అపారమైన మేధస్సు ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఎంపిక కాలేకపోతున్న వారి కోసం సింగరేణి ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టామని వివరించారు. మెయిన్స్‌కు ఎంపికైన వారికి రూ.లక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి మరో రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు ఢిల్లీలో వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు వివరించారు. మొదటిసారి 140 మంది మెయిన్స్‌కు ఎంపిక కాగా అందులో 20 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని వివరించారు. వారికి రెండు దశల్లోనూ ఆర్థిక సాయం అందించామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని సీనియర్ బ్యూరోక్రాట్లతో ఇంటర్వ్యూ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు భట్టి తెలిపారు ఈ మేరకు చీఫ్ సెక్రటరీతో తాను చర్చించినట్టు వివరించారు. సింగరేణి సంస్థ సిఎండి ఎన్ బలరామ్ మాట్లాడుతూ పేదలు సైతం సివిల్స్ పరీక్షల్లో విజేతలుగా నిలవాలనే లక్ష్యంతో ఈ పథకానికి తమ సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా సాయమందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సిగరేణి డైరెక్టర్ గౌతమ్ పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి వెంకన్న, జనరల్ మేనేజర్ కో - ఆర్డినేషన్ మార్కెటింగ్ తాడబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. చట్టప్రకారం ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తెలిపింది. ఎస్‌సి, ఎస్‌టి జనాభా లేని చోట కూడా ఆయా కులాలకు వార్డుమెంబర్లు, సర్పంచి రిజర్వేషన్లు కేటాయించారన్న పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచ్ రిజర్వేషన్లు కేటాయించటం వల్ల తప్పులు దొర్లాయని తెలిపారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులానికి చెందిన వ్యక్తులు లేకపోతే ఎన్నికల నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఎస్ఇసి వాదనను రికార్డు చేసుకున్న హైకోర్టు.. పిటిషన్లపై విచారణ ముగించింది.

ఎన్‌సిటిఇని సవరించాలి : ఎంపి చామల

హైదరాబాద్ బ్యూరో : విద్యాహక్కు చట్టం-2009, జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సిటిఇ) చట్టం-1993ని సవరించాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని ఇటీవల ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్య కలిసి వినతిపత్రం అందజేశారు. దాని ఆధారంగా గురువారం పార్లమెంటులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. 2010 ఆగస్టు 23కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని కోరారు. ఆ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేయడం వల్ల లక్షలాది మంది తీవ్ర ఆందోళనలో ఉన్నారని వివరించారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకసార్లు 2010, ఆగస్టు 23కి ముందు నియామకమైన టీచర్లకు టెట్ వర్తించబోదంటూ చెప్పాయని గుర్తు చేశారు. దీంతో వారు టెట్ రాతపరీక్షలకు హాజరు కాలేదని వివరించారు. ఇప్పుడు వారు రెండేండ్లలోపు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేయడం పూర్తిగా అన్యాయమని అన్నారు. వారు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదముందని చెప్పారు. సీనియర్ ఉపాధ్యాయుల భవిష్యత్ సంక్షోభంలో పడుతోందన్నారు. ఉపాధ్యాయుల హక్కులను రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌వికె సేవలు

- గచ్చిబౌలి ఎస్‌వికె సందర్శనకు పిల్లలను ప్రోత్సహించండి
- ఎంఇఓలకు రంగారెడ్డి డిఇఓ సుశీందర్ రావు ఆదేశం
- బాలోత్సవ్ పోటీల్లో విజేతలకు బహుమతుల అందజేత



బాలోత్సవ్ సభలో సుశీంధర్ రావు, పి ప్రభాకర్ తదితరులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రం సేవలను విరివిగా ఉపయోగించుకోనున్నట్టు రంగారెడ్డి జిల్లా విద్యాధికారి పి సుశీందర్ రావు తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (గచ్చిబౌలి) ఆధ్వర్యంలో కార్యదర్శి పి ప్రభాకర్ అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన బాలోత్సవ్ సభ మొదటి రోజు ముగింపు సభకు సుశీంధర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలు బాగున్నాయని అభినందించారు. ఆ కేంద్రంలో ఉన్న పెద్ద గ్రంధాలయాన్ని పేద విద్యార్థుల కోసం పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని మండల విద్యాధికారులను ఆదేశించారు. వినడం కన్నా చదవడం ద్వారా నేర్చుకున్న విషయాలు ఎక్కువగా గుర్తుంటాయని తెలిపారు. అదే పనిగా తరగతి గదిలో చదువుకోమంటే పిల్లలు ఇష్టపడరనీ, బాలోత్సవ్ లాంటి కార్యక్రమాల్లో పాల్గొంటూ, ఎస్వీకే లాంటి చోట్లకు వచ్చి బయటి ప్రపంచం చూస్తుంటే వారికి ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు చదువు నేర్పించే ముందు పిల్లల మనసులను గెలవాలన్నారు. పిల్లల నుంచి ఎక్కువగా మా టీచర్ కొడుతుంది... తిడుతుంది.. లాంటి ఫిర్యాదులు రావడానికి ఆ టీచర్‌ను పిల్లలు ఇష్టపడకపోవడమే కారణమని వివరించారు. సమాజం మంచి కోరేవారు, సమాజం చెడు కోరేవారు ఇద్దరూ తరగతి గది నుంచే తయారవుతారని వ్యాఖ్యానించారు. ఏ టీచర్ అయితే విద్యార్థినీని సరిగ్గా తీర్చిదిద్దరో ఆ గది నుంచి వచ్చే వారు చెడు కోరేవారుగా తయారవుతున్నారని చెప్పారు. తమ పరిధిలో 1,500 స్కూళ్లు ఉన్నాయని, అవసరం మేరకు ఎస్‌వికె సేవలను ఉపయోగించుకుంటామని తెలిపారు.

సభకు మరో అతిథిగా హాజరైన ఎన్ఐటి రిటైర్డ్ ప్రొఫెసర్, జేవీవీ గౌరవాధ్యక్షులు ఎ.రాంచంద్రయ్య మాట్లాడుతూ పిల్లలను తీర్చిదిద్దే దర్శకత్వ బాధ్యతను టీచర్లు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. మనిషి అని గుర్తించడానికి కళా దృక్పథం ఉండాలని సూచించారు. కళాత్మక దృష్టి ఉంటేనే మనిషి ఉత్తేజంగా ఉంటారని, ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ వయోలిన్ వాయించే వాడని ఉదహరించారు. తాను నాలుగో తరగతి నుంచి పరిశోధన చేసేంత వరకు ప్రతీ ఏడాది నాలుగైదు కళాత్మాక కార్యక్రమాల్లో పాల్గొనే వారమని గుర్తుచేసుకున్నారు. ఏ విషయాన్నైనా గుడ్డిగా నమ్మొద్దనీ, సంశయాత్మకంగా ఉన్న విషయాలపై ప్రశ్నించి తెలుసుకోవాలని సూచించారు. రాజ్యాంగం కూడా అదే విషయాన్ని చెబుతుందని వివరించారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో వస్తున్న చెకుముకి పిల్లల్లో శాస్త్రీయ అవగాహన పెంచుతోందని తెలిపారు. 1930లో సివి రామన్‌కు సైన్సులో నోబెల్ బహుమతి వచ్చిన తర్వాత మళ్లీ ఇప్పటి వరకు భారతదేశం నుంచి ఎవరికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అలాంటి అత్యున్నత బహుమతిని అందుకునే దిశగా మన ఆలోచనలుండాలని ఆకాంక్షించారు.

సభాధ్యక్షులు ప్రభాకర్ మాట్లాడుతూ బాలోత్సవ్‌లో భాగంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పిల్లలు పాల్గొన్నారని తెలిపారు. ఆయా స్కూళ్లలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులతో తుది పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన సిబ్బంది, ఉపాధ్యాయులు, డ్యాన్సర్లు తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం కూడా బాలోత్సవ్ కొనసాగుతుందని చెప్పారు. ఎస్వీకే సమీపంలోని 10 చోట్ల పేద విద్యార్థులకు ట్యూషన్స్ చెబుతున్నట్టు వివరించారు. పేద విద్యార్థులతో పాటు బడ్జెట్ స్కూళ్ల విద్యార్థులు విద్యావసరాల కోసం ఎస్వీకేను సంప్రదిస్తే అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఎస్వీకే గ్రంథాలయంలో తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో 3 లక్షల పుస్తకాలున్నాయనీ, వాటిలో 15 వేల పుస్తకాలు డిజిటల్‌లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రతి నెల మొదటి ఆదివారం పది మంది స్పెషలిస్టులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, ఉచితంగా మందులందిస్తున్నట్టు వెల్లడించారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ కూడా కొనసాగుతోందని వివరించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రధానంగా నిలిచిన పుచ్చలపల్లి సుందరయ్య.... తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపిన అగ్రగణ్యుల్లో ఒకరని చెప్పారు. మొదటి పార్లమెంటులో ఆయన ప్రతిపక్ష నేతగా క్యాబినెట్ హోదా ఉన్నా కూడా సైకిల్‌పై ప్రయాణించిన ఆయన ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. సుందరయ్య ఆశయాల సాధనకు తమ కృషి కొనసాగుతుందని, ఏ సమస్య ఉన్న సంప్రదించాలని పిలుపునిచ్చారు.

అంతకు ముందు చంద్రయ్య మ్యాజిక్ షో ద్వారా పిల్లల్లో శాస్త్రీయ అవగాహన పెంచే ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆహుతులతో కలిసి సుశీందర్ రావు విజేతలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమాన్ని శ్రద్ధగా ఆలకించి నేర్చుకుంటున్న ఐదో తరగతి విద్యార్థినీ ప్రత్యేకంగా అభినందించిన డీఈవో ఆమెకు వ్యక్తిగతంగా రూ.1,000 నగదు పారితోషికాన్ని ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల విద్యాధికారి కె.వెంకటయ్య, గండిపేట మండల విద్యాధికారి సునీల్ కుమార్, ఎస్‌వికె ట్రస్ట్ సభ్యులు ఆర్ సాంబశివరావు, కల్చరల్ బాధ్యులు శ్రీనివాసరావు, ఎస్‌వికె బాధ్యులు అనిల్, రవి, మహిళా బాధ్యులు మంజుల, బాలోత్సవ్ కన్వీనర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థి భర్త ఆత్మహత్య

- రాజకీయ ఒత్తిళ్లే కారణమంటున్న భార్య
- నిర్మల్ జిల్లా ఎర్వచింతల్‌లో ఘటన

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

ఇటీవలే సర్పంచ్‌గా నామినేషన్ వేసిన మహిళా అభ్యర్థి భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశమైంది. దీనికి రాజకీయ ఒత్తిళ్లే కారణమంటూ భార్య ఆరోపించడం ఇందుకు మరింత ఆజ్యం పోస్తోంది. ఈ ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ (సోమార్‌పేట్)లో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్వచింతల్ (సోమార్‌పేట్) గ్రామానికి చెందిన బండారి రవీందర్ (54) గతంలో టిడిపి కార్యకర్తగా పనిచేశారు. ప్రస్తుత కాంగ్రెస్, బిఆర్ఎస్ హయాంలో చురుకైన నాయకుడిగా ఎదిగారు. రైతుగా మంచిపేరు తెచ్చుకున్నారు. ఇటీవలే కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లోకి వెళ్లారు. తన భార్య బండారి పుష్పను ఆ ఊరి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయించారు. ఇంతలోనే గురువారం ఉదయం తన ఇంటిపక్కనున్న పశువుల కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం పలు అనుమానాలకు తావిస్తోంది. అందరితో కలివిడిగా మెలిగే రవీందర్ మృతిని గ్రామస్తులు జీర్ణించుకోలేపోతున్నారు. కాగా, ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతునికి భార్య పుష్ప, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గైక్వాడ్ రాహుల్ తెలిపారు.



41 బిందెలు స్వాధీనం

- సర్పంచ్ అభ్యర్థిపై కేసు నమోదు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కంకల్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి ఓటర్లకు పంచుతున్న బిందెలను ఎన్నికల స్పెషల్ టీం గురువారం స్వాధీనం చేసుకుంది. సర్పంచ్ అభ్యర్థిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఓటర్లను మభ్యపెట్టి ఓట్లు వేయించుకునేందుకు 41 బిందెలను పంచుతుండగా పక్కా సమాచారంతో పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. ఏ గ్రామాల్లోనైనా ఎన్నికల్లో మద్యంతో పాటు డబ్బు, బంగారు ఆభరణాలు వంటివి ఓటర్లకు పంచినట్టు తెలిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సింగరేణి విద్యుత్ ప్రాజెక్ట్‌లకు రాజస్థాన్ క్యాబినెట్ ఆమోదం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

సింగరేణి సంస్థ రాజస్థాన్‌లో ప్రతిపాదించిన 2,300 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్ట్‌లకు తమ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి రాజస్థాన్‌లో సింగరేణి విద్యుత్ ప్రాజెక్ట్‌లపై చర్చించారు. రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ సింగరేణితో కలిసి 1,500 మెగావాట్ల సోలార్, 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పాదన కోసం ఒప్పందం కుదుర్చుకుందని, దీనికి తమ రాష్ట్ర క్యాబినెట్ అనుమతి మంజూరు చేసిందన్నారు. రెండు రాష్ట్రాల విద్యుత్ అవసరాలకు ఈ కొత్త ప్రాజెక్టులు ఎంతో దోహదపడుతాయని అభిప్రాయ పడ్డారు. వీటిని త్వరగా పూర్తి చేయడానికి తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్‌కు చెందిన అధికారులు కాలూరామ్, ప్రమోద్ శర్మ, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఇడి చిరంజీవి, కో ఆర్డినేషన్ జీఎం టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కళాశాలల్లో ర్యాగింగ్‌ను అరికట్టాలి

- బాధ్యులను కఠినంగా శిక్షించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కళాశాలల్లో ర్యాగింగ్‌ను అరికట్టాలని, అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ఇటీవల ర్యాగింగ్ ఘటనలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయనీ, ఇంజినీరింగ్ కళశాలల్లోనూ తరచుగా ర్యాగింగ్ ఘటనలు జరుగుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం మెడికల్ కళాశాల్లో ర్యాగింగ్ చేశారని, సంగారెడ్డి మెడికల్ కళాశాలలో జరిగిన ఘటన దారుణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాగింగ్ చట్టాలను అమలు చేస్తేనే కళాశాలలకు అనుమతులు ఇవ్వాలనీ, ప్రభుత్వ కళాశాలల్లో కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి మెడికల్ కాలేజీ ఘటనలో పాల్గొన్న దోషులను కఠినంగా శిక్షించాలని, అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ర్యాగింగ్‌పై అవగాహన కల్పించాలని కోరారు.

ఆ ప్రాంతాలకు హెచ్‌ఆర్‌ఎ పెంచాలి

- టిజిఇజెఎసి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

జిహెచ్ఎంసి పరిధిలోకి కొత్తగా తెచ్చిన ప్రాంతాలకు ఇంటి అద్దె రాయితీని (హెచ్ఆర్ఎ) 24 శాతానికి పెంచాలని టిజిఇజెఎసి కోరింది. అలాగే పెండింగ్ డిఎలు, ఇహెచ్ఎస్ కార్డులు, పెండింగ్ బిల్లలకు నెలకు రూ.1,500 కోట్లు మంజూరు చేయాలని, టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం దాని పరిసర ప్రాంతాలను కొంగరకలాన్ గ్రామ పరిధినీ, ఆదిభట్ల మున్సిపల్ పరిమితులను జిహెచ్ఎంసి పరిధిలోకి తీసుకొచ్చినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, దానికి సమీపంలో ఉన్న ఎనిమిది కిలోమీటర్ల పరిధిలోని ఉద్యోగులందరికీ 24 శాతం హెచ్ఆర్ఎను అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. హెచ్ఆర్ఎను పెంచుతూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను విన్నవించనున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని కోరినట్టు వెల్లడించారు.

హెచ్‌ఐఎల్‌టిపి పేరుతో భారీ భూ కుంభకోణం

- పరిశ్రమల భూములను అపార్ట్‌మెంట్లు, విల్లాలకు మార్చే కుట్ర
- రూ.1.50 లక్షల గజం భూమి రూ.4,000కే అప్పగింత : కెటిఆర్



ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

హెచ్ఐఎల్‌టిపి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.ఐదు లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. హెచ్ఐఎల్‌టీపీ మీద బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలకు, పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను.. ఈ ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని కెటిఆర్ తెలిపారు. పరిశ్రమలు వద్దంటూ.. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టుకోవాలని పారిశ్రామిక భూములను ఇస్తోందన్నారు. మార్కెట్‌లో గజం ధర రూ.లక్ష 50 వేలు పలుకుతుంటే, ప్రభుత్వం కేవలం రూ.4000కే ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పుతోందన్నారు. ఈ భూములను వెనక్కి తీసుకుని ఇళ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు నిర్మించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామని తెలపారు. ఈ అంశాన్ని ఇక్కడితో వదిలిపెట్టబోమని.. ప్రజాసంఘాలు, ఇతర పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని అన్నారు. అవసరమైతే ఇందుకోసం ఒక చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు.

సిఎం రేవంత్‌రెడ్డి భూ కుంభకోణంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావద్దని కెటిఆర్ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే, ఆ భూములతోపాటు డబ్బులు కూడా పోతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక... ఓ తెలంగాణ బిడ్డ తమకు సమాచారం ఇచ్చారని చెప్పారు. తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా సమాచారం లీకైందంటూ ప్రభుత్వం బాధపడుతోందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ తెచ్చిన గ్రిడ్ పాలసీ మాదిరిగానే పరిశ్రమలను ప్రోత్సహించే విధానాలను కొనసాగించాలని సూచించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఫార్మాసిటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలను కేటీఆర్ సందర్శించి కార్మికులతో, పారిశ్రామికవేత్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కెపి వివేకానంద్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పార్లమెంటరీ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

కెటిఆర్ పర్యటనలో విషాదం..
గుండెపోటుతో ఫోటోగ్రాఫర్ మృతి

జీడిమెట్ల ప్రాంతంలో కేటీఆర్ పర్యటనలో అపశృతి చోటుచేసుకుంది. ఆయన పర్యటనను చిత్రీకరిస్తున్న ఓ జాతీయ ఛానల్ కెమెరామెన్ గుండెపోటుతో కుప్పకూలాడు. వెంటనే అతన్ని స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందారు.

సర్వే ఆఫ్ ల్యాండ్ అధికారి అదనపు ఆస్తుల గుర్తింపు

- ఆరు ప్రాంతాల్లో ఎసిబి అధికారులు సోదాలు
- రూ.5 లక్షల నగదుతోపాటు వందల కోట్ల విలువ చేసే ల్యాండ్ డాక్యుమెంట్స్ గుర్తింపు



కె శ్రీనివాస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా లాండ్స్ అండ్ సర్వే రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎడి) కె శ్రీనివాస్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్టు ఎసిబి అధికారులు గుర్తించారు. తప్పుడు సర్వేలతో ప్రభుత్వ భూములను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టి పెద్ద మొత్తంలో ఆస్తులు కూడబెట్టినట్టు ఎసిబికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో గురువారం ఎసిబి అధికారులు ఆరు బృందాలుగా వీడిపోయి ఏకకాలంలో ఆయన ఇల్లు, ఆఫీసు, బంధువులు, బినామీల ఇండ్లల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో వంద కోట్లకుపైగా ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు కె శ్రీనివాస్ ఐదేళ్లుగా ఎడిగా పనిచేస్తున్నారు. గతంలో మేడ్చల్ జిల్లాకు సంబంధించిన ఓ భూ వివాదంలో ఇతనిపై ఎసిబి కేసు నమోదై సస్పెండ్‌కు గురయ్యారు. అనంతరం మళ్లీ ఎడిగా విధుల్లో చేరారు. ఈ క్రమంలో మళ్లీ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై ఓ వ్యక్తి ఎసిబికి ఫిర్యాదు చేశాడు. దాంతో రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు గురువారం ఆరుచోట్ల సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రంగారెడ్డి జిల్లా రాయదుర్గం మై హోం భుజాలో విలాసవంతమైన ప్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల భూమి, అనంతపూర్‌లో 11 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు గుర్తించారు. అదే విధంగా నారాయణపేటలో రైస్‌మిల్, మూడు ప్లాట్లు, మహబూబ్‌నగర్‌లో నాలుగు ప్లాట్లు, అతని ఇంట్లో 1.6 కేజీల బంగారు ఆభరణాలు, 770 గ్రాముల వెండి వస్తువులు, కియా, ఇన్నోవా కారు, రూ.ఐదు లక్షల నగదు ఉన్నట్టు గుర్తించారు. ఇంకా సోదాలు కొనసాగుతున్నట్టు ఎసిబి అధికారులు వెల్లడించారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

కొనసాగుతున్న ఇండిగో విమానాల రద్దు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతోంది. సిబ్బంది కొరత సాంకేతిక సమస్యలతో వరుసగా రెండో రోజూ సంస్థకు చెందిన విమానాలు పెద్ద సంఖ్యలో రద్దయ్యాయి. బుధవారం హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లాల్సిన 19 విమానాలు, వివిధ విమానాశ్రయాల నుంచి ఆర్‌జిఐకి రావాల్సిన 21 విమానాలు రద్దయిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు పిఆర్ఓ ఒక ప్రకటన విడుదల చేశారు.

పెళ్లి పేరిట మోసం

- పోలీసులకు మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఆన్‌లైన్‌లో పెళ్లి పేరుతో ఓ మహిళ మోసానికి గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. హిరాద్ అహ్మద్ అనే వ్యక్తి యూకేలో డాక్టర్‌గా పనిచేస్తున్నట్లు నటిస్తూ మహిళకు పరిచయమయ్యాడు. వాట్సప్ కాల్స్, మెసేజ్‌లు, వీడియో చాటింగ్ చేసేవాడు. వివాహ ప్రతిపాదన పేరుతో రెండు బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేయడంతో పాటు రెండు కొత్త సిమ్‌లు కొనుగోలు చేశాడు. బ్యాంకు పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులను న్యూఢిల్లీలోని యూకే వ్యవహారాల కార్యాలయానికి పంపాలని ఒత్తిడి చేశాడు. నకిలీ వీసా, వివాహ పత్రాలు పంపాడు. ప్రాసెసింగ్, వీసా ఫీజులు, ఆలస్యానికి జరిమానాలు, లగేజ్ సమస్యలు, హోటల్ బస ఇలా వివిధ కారణాలు చెప్పి డబ్బు డిమాండ్ చేశాడు. దీంతో రూ.3,38,200 ఆ మహిళ బదిలీ చేసింది. ఆ తర్వాత కాంటాక్ట్ నిలిచిపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



సిఐటియు రాష్ట్ర మహాసభలకు ముమ్మర ఏర్పాట్లు

- వాల్ రైటింగ్‌లతో మెదక్ పట్టణంలో ప్రచారం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

సిఐటియు రాష్ట్ర 5వ మహాసభ జయప్రదానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 7,8,9 తేదీల్లో నిర్వహించే మహాసభకు సిఐటియు ఆధ్వర్యంలో మెదక్ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సిఐటియు మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం కోసం వాల్ పెయింటింగ్ పూర్తి చేశారు. రెండు రకాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభ జయప్రదం చేయాలని ఒక పోస్టర్, మహాసభలో పాల్గొనే నాయకుల పేర్లతో మరో పోస్టర్ ప్రదర్శించి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మహాసభను జయప్రదం చేయడం కోసం మెదక్ పట్టణంలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, మెదక్ జిల్లా ఇన్‌చార్జి జె మల్లిఖార్జున్ పర్యవేక్షిస్తున్నారు. ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్ ఎం అడివయ్య ప్రత్యక్ష సహకారంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. మెదక్ జిల్లాలో 21 మండలాలు, 73 సిఐటియు అనుబంధ సంఘాల సహకారంతో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా, రాష్ట్ర మహాసభ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శుక్రవారం సిఐటియు జెండావిష్కరణలు చేయనున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ మల్లేశం మాట్లాడుతూ.. సిఐటియు రాష్ట్ర మహాసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. మెదక్ జిల్లాలోని 73 సిఐటియు అనుబంధ సంఘాల కార్మికులు పెద్ద ఎత్తున సహకారం అందించారన్నారు. జిల్లాలోని పది రకాల రాష్ట్ర యూనియన్లు ఈ మహాసభలో పాల్గొననున్నట్టు చెప్పారు.

అక్కడ ఎన్నికలు లేవు

- పేరూరు, అభంగాపురంలో రిజర్వేషన్ల లోపాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెండు గ్రామపంచాయతీలు, మూడు మండలాల్లోని కొన్ని వార్డులకు రిజర్వేషన్లలో లోపాల కారణంగా నామినేషన్లు దాఖలు లేదు. ఆ గ్రామాల్లో రిజర్వు అయిన సామాజిక తరగతికి సంబంధించి ఓటర్లు లేకపోవడంతో ఎవరూ నామినేషన్ వేయలేదు. కోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులు వార్డుల్లోనూ నామినేషన్లు వేయలేదు.

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అభంగాపురంలో ఎస్‌టి రిజర్వ్ అయింది. ఆ గ్రామంలో ఎస్‌టి ఓటర్లు లేకపోవడంతో సర్పంచ్ పదవికి ఎవరూ నామినేషన్ వేయలేదు. అనుముల మండలంలోని పేరూరు గ్రామం కూడా ఎస్‌టి మహిళ రిజర్వ్ అయింది. అక్కడా ఎస్‌టి ఓటర్లు ఎవరూ లేకపోవడంతో సర్పంచ్ పదవితోపాటు పది వార్డులకు నామినేషన్ వేయకుండా గ్రామస్తులు బహిష్కరించారు. రిజర్వేషన్ మార్పు చేయాలని హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు వార్డు సభ్యులకు కూడా నామినేషన్లు దాఖలు చేయలేదు. దీంతోపాటు మాడ్గులపల్లి మండలంలోని 11 వార్డులకు, నిడమనూరు మండలంలో రెండు వార్డులకు, తిరుమలగిరి (సాగర్) మండలంలో మూడు వార్డులకు నామినేషన్ దాఖలు కాలేదు.

ఈ నెల 10న... ఢిల్లీలో ఉపాధ్యాయ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

- ఎస్‌టిఎఫ్ఐ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

జాతీయ స్థాయి ఉపాధ్యాయ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని డిసెంబర్ 10న ఉదయం 11 గంటలకు న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ సమీపంలోని హెచ్‌కెఎస్ సూర్జిత్ భవన్‌లో నిర్వహిస్తున్నట్టు స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) తెలిపింది. ఈ మేరకు ఎస్టీఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి ఎన్ భార్తి, చావ రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్షను తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాల రక్షణ, విద్యారంగంలో సంక్షోభ నివారణకు కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి తగిన ఐక్య కార్యాచరణను రూపొందించుకోనున్నట్టు వారు చెప్పారు. ఉద్యోగ విరమణకు ఐదు సంవత్సరాల పైబడిన సర్వీసు ఉన్న ఉపాధ్యాయులందరూ రెండేండ్లలో టెట్ ఉత్తీర్ణులు కాకుంటే వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఉపాధ్యాయుల ఉద్యోగాలకు ముప్పు ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులను తొలగిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యారంగంలో తీవ్రమైన సంక్షోభం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తీర్పుపై రెండు నెలల నుంచి దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. పలువురు ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావించినా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో పని చేస్తున్న అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో టెట్ సమస్యపై చర్చించి ఏకాభిప్రాయం ద్వారా తదుపరి కార్యాచరణను రూపొందించే దిశగా ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల జాతీయ స్థాయి ప్రతినిధులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను తెలియజేసి, కార్యాచరణలో భాగస్వాములు కావాలని వారు కోరారు.

ఢిల్లీ పరిస్థితి రావద్దనే హిల్ట్ పాలసీ

- మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ మొత్తం కాలుష్యమయంగా మారిందని, అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావద్దనే హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్టు టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అలాంటి పాలసీపై విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. బీఆర్ఎస్ నేతలు పదేండ్లు తెలంగాణను అమ్మేసుకున్నా బీజేపీ నాయకులు మాట్లాడలేదని గుర్తుచేశారు. హిల్ట్ పాలసీతో కాలుష్యం, భూముల ధరలు తగ్గే అవకాశముంటే దానిపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సామెతలాగా మాట్లాడిన దానిని బిజెపి వక్రీకరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సినీ గాయకులు ఎస్‌పి బాలసుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటుపై రాద్ధాంతం చేయడం తగదన్నారు. కళాకారులు, సాహిత్యకారులకు కుల, మతాలను ఆపాదించడం తగదు తెలంగాణ, ఆంధ్ర భౌగోళికంగా విడిపోయినా అన్నదమ్ముల్లా కలిసి ఉందామని సూచించారు. రెండేళ్ల ప్రజాపాలనా ఉత్సవాల దృష్టి మళ్లించేందుకే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇన్ అండ్ ఔటర్ భూములను బిఆర్ఎస్ అమ్మకాలకు పెట్టినప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలతో బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటేనని తేలిపోయిందని తెలిపారు.

ఐ బొమ్మ రవి పిటిషన్లపై ముగిసిన వాదనలు

- తీర్పు రేపటికి వాయిదా

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఐ–బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కస్టడీ పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేసిన అతని తరపు న్యాయవాదులు నాంపల్లి కోర్టులో వాదనలు వినిపించారు. ఇప్పటికే ఒక కేసులో రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఎనిమిది రోజుల పాటు విచారించారని కోర్టుకు తెలిపారు. ఒకే రకమైన కేసులో మళ్లీ కస్టడీ కోరతున్నారని, నిందితుడికి బెయిల్ రాకుండా పోలీసులు చూస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. తండేల్, కుబేర సినిమాల పైరసీ కేసులకు సంబంధించి మరింత సమాచారం సేకరించాలని పోలీసులు తెలిపారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం తీర్పు రేపటికి వాయిదా వేసింది. మరోవైపు రవి బెయిల్ పిటిషన్లపైనా వాదనలు ముగియడంతో తీర్పు రేపటికి వాయిదా పడింది.